


# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

శనివారం,
జూన్ 13, 2026

సంపుటి : 10 సంచిక :14 రంగారెడ్డి ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ పేజీలు 8 వెల 4/-


## నామినేషన్ వివాదంలో
# మీనాక్షికి సుప్రీం షాక్

ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోలేమన్న సర్వోన్నత న్యాయస్థానం

రాజ్యాంగ నిబంధనలు తమ చేతులను కట్టేశాయని స్పష్టీకరణ

ఆర్వో నిర్ణయాన్ని సవాల్ చేయాలంటే ఎన్నికల పిటిషనే మార్గమని వెల్లడి

నామినేషన్ తిరస్కరణపై హైకోర్టును ఆశ్రయించవచ్చని సూచన

కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ.. న్యాయపోరాటం కొనసాగిస్తామన్న ఖర్గే

కాంగ్రెస్ అంతర్గత వైఫల్యమే కారణమంటూ భాజపా ఎదురుదాడి



న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన మీనాక్షి నటరాజన్‌కు సుప్రీంకోర్టులో నిరాశ ఎదురైంది. ఆమె నామినేషన్ పత్రాన్ని రిటర్నింగ్ అధికారి తిరస్కరించిన నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం ఎన్నికల ప్రక్రియ మధ్యలో తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. రాజ్యాంగ నిబంధనలు ఇందుకు అనుమతించవని పేర్కొంటూ ఆమె పిటిషన్‌ను కొట్టివేసింది. అయితే రిటర్నింగ్ అధికారి నిర్ణయాన్ని ఎన్నికల పిటిషన్ ద్వారా సవాల్ చేసే హక్కు ఆమెకు ఉందని స్పష్టం చేస్తూ సంబంధిత హైకోర్టును ఆశ్రయించవచ్చని సూచించింది. జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్ర, జస్టిస్ ఎ.ఎస్. చందూర్కర్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ కేసును విచారించింది. ఎన్నికల ప్రక్రియలో భాగంగా తీసుకున్న నిర్ణయాలపై కోర్టులు మధ్యంతర జోక్యం చేసుకోవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని అభిప్రాయపడింది. కేసు విషయార్హతపై తాము ఎలాంటి వ్యాఖ్యలు చేయబోమని స్పష్టం చేసింది. ఒకసారి నామినేషన్ తిరస్కరణ జరిగిన తర్వాత దానిపై పరిష్కారం ఎన్నికల చట్టాలు నిర్దేశించిన మార్గాల్లోనే వెతకాల్సి ఉంటుందని పేర్కొంది. మీనాక్షి తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. ఆమెపై రెండేళ్లకుపైగా శిక్ష పడే క్రిమినల్ కేసులు ఏవీ లేవని తెలిపారు. కొన్ని కేసుల్లో సమన్లు మాత్రమే జారీ అయ్యాయని, అలాంటి పరిస్థితిలో

(మిగతా 2వ పేజీలో)

# కిమ్ బాటలో కాషాయ పార్టీ!

ఉత్తర కొరియా తరహాలో ఓటు-సీటు చోరీలకు బీజేపీ పాల్పడుతోందన్న సీఎం రేవంత్

మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ వెనుక రాజకీయ కుట్ర ఉందని ఆరోపణ

తెలంగాణకు రావాల్సిన ప్రాజెక్టులను అడ్డుకుంటున్నారని కిషన్‌రెడ్డిపై విమర్శలు

నిధుల కేటాయింపులో బీజేపీయేతర రాష్ట్రాలపై వివక్ష కొనసాగుతోందని వ్యాఖ్య

రాష్ట్ర హక్కుల కోసం కేంద్రంపై పోరాటం కొనసాగుతుందని స్పష్టం

నీతి ఆయోగ్ సమావేశం అనంతరం ఢిల్లీలో సీఎం మీడియా చిట్‌చాట్



న్యూఢిల్లీ: దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే విధంగా భారతీయ జనతా పార్టీ వ్యవహరిస్తోందని, ఉత్తర కొరియా నియంత కిమ్ జాంగ్ ఉన్ పాలనా శైలిని ఆదర్శంగా తీసుకుని ఓటు చోరీలు, సీటు చోరీలకు పాల్పడుతోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. నీతి ఆయోగ్ సమావేశంలో పాల్గొనేందుకు ఢిల్లీ వెళ్లిన సందర్భంగా మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన కేంద్ర ప్రభుత్వ విధానాలు, బీజేపీ రాజకీయ వ్యూహాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. మధ్యప్రదేశ్ నుంచి కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థిగా బరిలో నిలిచిన మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ వెనుక బీజేపీ కుట్ర స్పష్టంగా కనిపిస్తోందని సీఎం ఆరోపించారు. ఆమెపై ఎలాంటి క్రిమినల్ కేసులు నమోదు కాకపోయినా, కేవలం ఊహాజనిత అంశాలను ఆధారంగా చేసుకుని నామినేషన్‌ను తిరస్కరించారని విమర్శించారు. దీనికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నితిన్ నబీన్, స్థానిక ఎన్నికల అధికారులు బాధ్యత వహించాలని అన్నారు. ఉత్తర కొరియాలో ఎన్నికల ప్రక్రియ ఎలా ఒకే పార్టీకి అనుకూలంగా సాగుతుందో, అదే విధంగా భారతదేశంలో కూడా బీజేపీ వ్యవస్థలను ప్రభావితం చేస్తోందని ఆయన ఆరోపించారు. ఓట్లు, సీట్లు అన్నీ తమకే దక్కేలా రాజకీయ కుట్రలు పన్నుతోందని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఇది ప్రమాదకర సంకేతమని హెచ్చరించారు. మధ్యప్రదేశ్ ఎన్నికల్లో గెలిచే సంఖ్యాబలం లేకపోయినా బీజేపీ అదనపు అభ్యర్థిని పోటీలో నిలబెట్టడం వెనుక వ్యూహాత్మక కుట్ర ఉందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మీనాక్షి నటరాజన్ నామినేషన్ దాఖలు చేసిన తర్వాతే ఆమెపై అనవసర వివాదాలను సృష్టించి ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేశారని ఆరోపించారు. తెలంగాణలో ఆమెపై ఎలాంటి కేసులు లేవని, కేవలం ప్రైవేట్ ఫిర్యాదుకు సంబంధించిన సమన్లను ఆధారంగా చేసుకుని నామినేషన్‌ను తిరస్కరించడం రాజకీయ ప్రేరేపిత చర్య అని పేర్కొన్నారు. తెలంగాణకు రావాల్సిన కీలక ప్రాజెక్టుల విషయంలో కేంద్రం వివక్ష చూపుతోందని సీఎం ఆరోపించారు. రాష్ట్రానికి అవసరమైన మెట్రో రైలు విస్తరణ, మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు, రీజినల్ రింగ్ రోడ్, ఇతర మౌలిక వసతుల అభివృద్ధి ప్రతిపాదనలు కేంద్రం వద్ద

(మిగతా 2వ పేజీలో)



## రాజకీయ రంగప్రవేశానికి
# లారెన్స్ సంకేతాలు

ప్రజల ఆమోదం ఉంటేనే రాజకీయాల్లోకి అడుగుపెడతానన్న ప్రముఖ నటుడు

పదవులు, డబ్బు కోసం కాదు.. సమాజసేవ కోసమే రాజకీయ ప్రయాణమని స్పష్టం

త్వరలో తన రాజకీయ భవిష్యత్‌పై ప్రకటన చేస్తానని వెల్లడి

అభిమానులు, ప్రజల అభిప్రాయాలనే తుది నిర్ణయానికి ప్రాతిపదికగా చెబుతున్న లారెన్స్

తమిళ రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపిన ‘ఎక్స్’ వీడియోలు

టీవీకేలో చేరికపై ఊహాగానాల మధ్య ఆసక్తికర వ్యాఖ్యలు

తిరుచ్చి ఈస్ట్ ఉపఎన్నికల ప్రచారానికి మరింత ఊపు

చెన్నై: తమిళ సినీ పరిశ్రమలో కొరియోగ్రాఫర్‌గా, దర్శకుడిగా, నటుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న రాఘవ లారెన్స్ రాజకీయ రంగ ప్రవేశానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. చాలా కాలంగా ఆయన రాజకీయాల్లోకి వస్తారన్న ప్రచారం సాగుతుండగా, తాజాగా స్వయంగా చేసిన ప్రకటన తమిళనాడు రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. శుక్రవారం తన ‘ఎక్స్’ ఖాతా ద్వారా రెండు వీడియోలను విడుదల చేసిన లారెన్స్ రాజకీయాలపై తన మనసులోని ఆలోచనలను ప్రజలతో పంచుకున్నారు. రాజకీయాల్లోకి రావాలన్న తన ఉద్దేశం వెనుక వ్యక్తిగత ప్రయోజనాలు లేవని లారెన్స్ స్పష్టం చేశారు. డబ్బు సంపాదించాలనే ఆశగానీ, పదవులు పొందాలనే ఆకాంక్షగానీ తనకు లేవని చెప్పారు. ప్రస్తుతం ఒక వ్యక్తిగా చేస్తున్న సామాజిక సేవను మరింత విస్తృత స్థాయిలో కొనసాగించేందుకు రాజకీయాలు ఒక వేదికగా ఉపయోగపడతాయని భావిస్తున్నట్లు వెల్లడించారు. రాజకీయాల్లోకి అడుగుపెడితే సమాజానికి మరింత పెద్ద ఎత్తున సేవ చేసే అవకాశం లభిస్తుందని

(మిగతా 2వ పేజీలో)



## బిర్యానీ తినిపించి.. పిల్లలతో కలిసి జలసమాధి

ఆర్థిక కష్టాలు, కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన తండ్రి

పిక్నిక్ పేరుతో ఇద్దరు చిన్నారులను నిజాంసాగర్‌కు తీసుకెళ్లిన ఘటన

బిర్యానీ తినిపించి, ఫొటోలు తీసి బంధువులకు పంపిన కృష్ణ

తెప్పపై ప్రాజెక్టు మధ్యలోకి వెళ్లి పిల్లలను నీటిలోకి తోసిన దారుణం

అనంతరం తానూ దూకి ఆత్మహత్య చేసుకున్న తండ్రి

## ఆర్నెల్ల పాపతో దూకిన తల్లి.. అద్భుతంగా బతికిన చిన్నారి

మియాపూర్‌లో విషాద ఘటన.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్య

ఆరు నెలల కూతురిని ఒడిలో పెట్టుకుని ఆరో అంతస్తు నుంచి దూకిన తల్లి

అక్కడికక్కడే మృతి చెందిన మహిళ.. ఇనుప కంచెకు చిక్కి బయటపడిన పసికందు



# అది ఇరాన్ ఘాతుకమే

భారతీయులున్న నౌకలపై ఇరాన్ సైన్యమే డ్రోన్లు ప్రయోగించింది

ఇలాంటి చర్యలు ఎంతమాత్రం అంగీకారయోగ్యం కాదు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టీకరణ

అమెరికా దాడి చేసినట్లు భారత్ ప్రకటన

భారత్‌లోని అమెరికా దౌత్యవేత్త జాసన్ మీక్స్‌కు మళ్లీ సమన్లు

వాషింగ్టన్: ఒమన్ తీరం సమీపంలో భారతీయ సిబ్బంది ఉన్న నౌకలపై దాడి చేసింది తాము కాదని.. అది ముమ్మాటికీ ఇరాన్ ఘాతుకమేనని అమె రికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం తేల్చిచెప్పారు. హార్ముజ్ జలసంధి నుంచి బయలుదేరిన నౌకలపై ఇరాన్ సైన్యం డ్రోన్లు ప్రయోగించిందని ఆరోపించారు. ఇలాంటి చర్యలు ఎంతమాత్రం అంగీకారయోగ్యం కాదని పేర్కొన్నారు. ఈ మేరకు ట్రూత్ సోషల్‌లో పోస్టుచేశారు. అలాగే శాంతి ఒప్పందంలోని పలు అంశాలను మీడియాకు ఇరాన్ లీక్ చేసిందని మండిపడ్డారు. ఇదిలా ఉండగా, మూడు నౌకలపై అమెరికా సైన్యం దాడి చేసినట్లు భారత ప్రభుత్వం పేర్కొన్న సంగతి తెలిసిందే. ఇంతలోనే ట్రంప్ ఇరాన్ వైపు వేలెత్తి చూపడం చర్చనీయాంశంగా మారింది.

### ప్రాణాంతక దాడులు ఆపాల్సిందే: భారత్

భారతీయ సిబ్బందితో కూడిన మూడు వాణిజ్య నౌకలపై అమెరికా దాడి చేయడాన్ని అంతకుముందు భారత ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఈ దాడిలో ముగ్గురు భారతీయులు మృతిచెందడం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తంచేసింది. ఇలాంటి ప్రాణాంతకమైన, ఘోరమైన దాడులు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని, వీటిని ఆపాల్సిందేనని

(మిగతా 2వ పేజీలో)



# గొల్లూరి చంద్రయ్య సగర మృతి బాధాకరం - సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి- లింగస్వామి

**- పూర్వ గ్రామ పాలకవర్గ సభ్యుడిగా వారి సేవలను ఆదర్శంగా తీసుకుంటాం-- ఉపసర్పంచ్ పల్లె మల్లారెడ్డి**

**- ప్రతి సగరుడికి లేబర్ ఇన్సూరెన్స్ కార్డు అందించిన ఘనత చంద్రయ్య సాగర్ దే- రాసాల వెంకటేష్ సాగర్**





యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి

సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన సగర సంఘం నాయకులు, తెలుగుదేశం వ్యవస్థాపక సభ్యులు, గొల్లూరి చంద్రయ్య సాగర్ అనారోగ్యంతో మృతి చెందారు వారి మరణ వార్త తెలుసుకున్న ఉమ్మడి నల్లగొండ జిల్లాల సగర సంఘం నాయకులు గొల్లూరి రాములు సగర, వడ్డేపల్లి రాములు సగర, చండూరు మున్సిపాలిటీ కో ఆప్షన్ మెంబర్ చంద్రకళ- మారయ్య సగర, గంట రాములు, కృష్ణ సాగర్, గంట ముత్యాలు, సీనియర్ పాత్రికేయులు గొల్లూరి గణేష్ సాగర్, కన్స్ట్రక్షన్ బిల్డర్ వడ్డేపల్లి సుబ్బయ్య, కల్లెట్ల నర్సింగ్ సాగర్, గ్రామ సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి- లింగస్వామి, ఉప సర్పంచ్ మల్లారెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు గొల్లూరి చంద్రయ్య సగర మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు,

**గొల్లూరి చంద్రయ్య సాగర్ సేవలను స్మరిస్తూ పలువురి నాయకుల మాట..!**

నందమూరి తారక రామారావు తెలుగుదేశం స్థాపించినప్పటి నుండి తెలుగుదేశం కార్యకర్తగా నిరంతరం పనిచేస్తూ, తెలుగుదేశం ప్రభుత్వంలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందడంలో, నారాయణపూర్ మండల వ్యాప్తంగా తెలుగుదేశం బలోపేతం కావడంలో గొల్లూరి చంద్రయ్య సగర పాత్ర ఉందని తెలిపారు. సంస్థాన్ నారాయణపూర్ లో సబ్స్టేషన్ ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు రావడంలో తన పాత్ర కూడా ఉందని పలువురు నాయకులు తెలిపారు.

**గ్రామ పాలకవర్గ సభ్యుడిగా వారి సేవలను ఆదర్శంగా తీసుకోవాలి..!**

సంస్థాన్ నారాయణపురం గ్రామ ఉపసర్పంచ్ పల్లె మల్లారెడ్డి మాట్లాడుతూ 40 సంవత్సరాల క్రితం నారాయణపురం 1 వ వార్డు మెంబర్ గా పనిచేసిన వారి సేవలను ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. వారికి గ్రామ అభివృద్ధిలో ఎంతో పట్టు ఉండేదని తెలిపారు.

**నారాయణపూర్ మండల సగరులకు గొల్లూరి చంద్రయ్య సేవలు మరువలేం.!**

యాదాద్రి భగీరథ ఆత్మగౌరవ ట్రస్ట్ భవన్ మెంబర్ రాసాల వెంకటేష్ సాగర్ మాట్లాడుతూ సంస్థాన్ నారాయణపురం మండల సగరులకు లేబర్ ఇన్సూరెన్స్ కార్డులు, బీసీలకు ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలను, సగరులు లబ్ధి పొందే ప్రతి విషయాన్ని సగరులకు అందించడంలోఎంతో సహాయంగా ఉండే వ్యక్తిని తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికై తాజ్ పూర్ సర్పంచ్ ర్యాకల సంతోష- శ్రీనివాస్ కృషి.!

**-15 లక్షల రూపాయల సొంత నిధులతో పాఠశాల అభివృద్ధి.!**

**- ప్రభుత్వ పాఠశాలలో చదివించిన కుటుంబాలకు ఇంటి పన్ను మినహాయింపు పథకం సంచలన నిర్ణయం.!**

**- ప్రభుత్వ పాఠశాలలో చదివించిన కుటుంబాల కె ప్రభుత్వ సంక్షేమ పథకాలకు మొదటి ప్రాధాన్యత నిర్ణయం.!**






యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి

భువనగిరి మండలం తాజ్ పూర్ గ్రామంలో ప్రొఫైసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష- శ్రీనివాస్ సారధ్యంలో "ప్రైవేటు పాఠశాలలకు దీటుగా" ప్రభుత్వ పాఠశాల ఉండాలని వారి సొంత నిధుల తో 15 లక్షలు ఖర్చుపెట్టి పాఠశాలను అత్యంత అద్భుతంగా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తయారు చేశారు.

**రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వ విద్యకు ప్రాధాన్యతలిస్తూ గ్రామ సభ తీర్మానం.!**

1) ప్రభుత్వ పాఠశాల లో చదివించిన కుటుంబాలకు ఇంటి పన్ను నినాయింపు

2 )ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్న కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల కు మొదటి ప్రాధాన్యత తీర్మానం

3) ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లల్ని చేరిస్తే వారి ఇంటి పన్ను సర్పంచ్ ర్యాకల సంతోష- శ్రీనివాస్ స్వయంగా ఇంటి పన్ను గ్రామపంచాయతీకి ప్రతి సంవత్సరం చెల్లిస్తానని హామీ ఇవ్వడం సంచల నిర్ణయం.!

తాజ్ పూర్ గ్రామ సర్పంచ్ గారి ఆధ్వర్యంలో ఈరోజు ప్రొఫైసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో ఇందులో భాగంగా గ్రామ సర్పంచ్ పాలకవర్గ సభ్యులతో కలిసి గడపగడపకు తిరిగి వారి సొంత ఖర్చులతో గ్రామ ప్రభుత్వ బడిని ప్రవేట్ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తయారు చేయడం సందర్భంగా నాణ్యమైన విద్యకి మన ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరడం జరిగింది ఈ సందర్భంగా సర్పంచ్ ర్యాకల సంతోష- శ్రీనివాస్ దేశంలో రాష్ట్రంలో లేని విధంగా వినూత్న ఆలోచనతో సంచలన నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ పాఠశాల బలోపేతాని కై పాఠశాలలో చదివించిన కుటుంబాలకు ఇంటి పన్ను రద్దు చేస్తానని అట్టి డబ్బులను గ్రామపంచాయతీకి తాను స్వయంగా చెల్లిస్తానని హామీ ఇవ్వడం జరిగింది అదేవిధంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు మొదటి ప్రాధాన్యత ప్రభుత్వ పాఠశాలల్లో చదివించిన కుటుంబాలకే అర్హులుగా ప్రకటిస్తామని తీర్మానాన్ని చేశారు. పాఠశాలలో అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామని వీటితో పాటు నాణ్యమైన అధ్యాపక బృందం చే చక్కని విద్యను అందించే విధంగా ముందు నిలబెడతానని తెలిపారు గ్రామ సర్పంచి సంతోష- శ్రీనివాస్ ఈ కార్యక్రమంలో సామాజికవేత్త, బిఆర్ఎస్ జిల్లా నాయకులు, ఆర్ఎస్ కె ఫౌండేషన్ అధినేత డాక్టర్ ర్యాకల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, అంగన్వాడి టీచర్లు, ఆశ వర్కర్లు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు



# బిర్యానీ తినిపించి.. పిల్లలతో కలిసి జలసమాధి



నిజాంసాగర్ (జుక్కల్): ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలు ఓ తండ్రిని అత్యంత దారుణ నిర్ణయం తీసుకునేలా చేశాయి. తన ఇద్దరు చిన్నారులకు బిర్యానీ తినిపించి, పర్యాటక ప్రదేశాలు చూపించి, వారితో ఆనందంగా గడిపిన అనంతరం ప్రాజెక్టు నీటిలోకి తీసుకెళ్లి హత్య చేసి, తానూ ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ ప్రాజెక్టు వద్ద కలకలం రేపింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపడంతో పాటు తల్లిని కన్నీరుమున్నీరుగా విలపించేలా చేసింది. సంగారెడ్డి జిల్లా నిజాంపేట గ్రామానికి చెందిన బోయి కృష్ణ (34), సవిత దంపతులకు కుమార్తె అనన్య (5), కుమారుడు రక్షిత్ (9) ఉన్నారు. రోజువారీ కూలీ పనులపైనే ఆధారపడే ఈ కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఉపాధి కోసం నాలుగు నెలల క్రితం కుటుంబ సమేతంగా రామచంద్రపురం ప్రాంతానికి వలస వెళ్లింది. అక్కడ కృష్ణ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తుండగా, సవిత ఓ హోటల్‌లో కార్మికురాలిగా పనిచేస్తోంది. అయితే కృష్ణ మద్యం అలవాటు కారణంగా ఉద్యోగాన్ని సక్రమంగా నిర్వహించకపోవడం, కుటుంబ అవసరాలకు సరిపడా ఆదాయం లేకపోవడంతో దంపతుల మధ్య తరచూ వివాదాలు జరిగేవి. ఒకవైపు అప్పులు, మరోవైపు పిల్లల చదువుల ఖర్చులు భరించలేని పరిస్థితి రావడంతో కృష్ణ తీవ్ర మానసిక ఒత్తిడికి గురైనట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. జీవితంపై విరక్తి చెందిన అతడు చివరకు ఘోర నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. గురువారం ఉదయం పిల్లలను పిక్నిక్‌కు తీసుకెళ్తానని చెప్పి బైక్‌పై పటాన్‌చెరు నుంచి నిజాంసాగర్ ప్రాజెక్టుకు తీసుకువచ్చాడు. అక్కడి పర్యాటక ప్రాంతాలను చూపిస్తూ వారితో కొంతసేపు గడిపాడు. హోటల్ నుంచి తీసుకొచ్చిన బిర్యానీని పిల్లలకు తినిపించాడు. అనంతరం పిల్లలతో కలిసి తీసుకున్న ఫొటోలను, వీడియోలను తన బంధువు నవీన్‌కు వాట్సాప్‌లో పంపించాడు. బయటకు చూస్తే సాధారణ విహారయాత్రలా కనిపించినా, అప్పటికే అతడు తన నిర్ణయాన్ని అమలు చేసే దిశగా అడుగులు వేస్తున్నాడు. ప్రాజెక్టు పరిసరాల్లో తిరుగుతూ పిల్లలతో సెల్ఫీలు దిగిన కృష్ణ, అనంతరం మత్స్యకారులు ఉపయోగించే తెప్పను తీసుకుని నీటి మధ్య భాగంలోకి వెళ్లాడు. అక్కడి నుంచి తన పిల్లలతో కలిసి ఉన్న వీడియోను బంధువులకు పంపిస్తూ ఆత్మహత్యకు పాల్పడబోతున్నట్లు సంకేతాలు ఇచ్చాడు. కొద్దిసేపటికే తెప్పపై నుంచి ఇద్దరు చిన్నారులను నీటిలోకి తోసివేసి, అనంతరం తానూ దూకి ప్రాణాలు తీసుకున్నాడు. సాయంత్రం వరకు భర్త, పిల్లలు ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన సవిత బంధువులకు ఫోన్ చేసింది. ఈ సమయంలో వాట్సాప్‌లో పంపిన వీడియోలు, సందేశాలు బయటకు రావడంతో విషాద ఘటన వెలుగులోకి వచ్చింది.

# కిమ్ బాటలో కాషాయ పార్టీ!

పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ అంశాలపై కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి స్పందించడం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడాల్సిన కిషన్‌రెడ్డి, తెలంగాణకు రావాల్సిన నిధులు, ప్రాజెక్టులను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుకు అవసరమైన భూముల సమస్యను పరిష్కరించలేరా అని ప్రశ్నించారు. రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై ప్రధాని, కేంద్ర మంత్రులను ఎంతసార్లు కలిశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీయేతర రాష్ట్రాలపై కేంద్రం నిధుల కేటాయింపులో వివక్ష చూపుతోందని సీఎం అన్నారు. కేంద్ర--రాష్ట్ర సంబంధాలు రాజకీయ ప్రయోజనాల ఆధారంగా కాకుండా సమాఖ్య స్ఫూర్తితో కొనసాగాలని సూచించారు. తెలంగాణ అభివృద్ధికి అవసరమైన ప్రాజెక్టులకు తక్షణమే ఆమోదం తెలిపి నిధులు విడుదల చేయాలని కేంద్రాన్ని కోరారు. గోదావరి జలాల వినియోగం, తుమ్మిడిహెట్టి బ్యారేజ్ నిర్మాణం వంటి అంశాలపై వచ్చే నెలలో మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరగనున్నట్లు రేవంత్‌రెడ్డి వెల్లడించారు. నీతి ఆయోగ్ సమావేశం సందర్భంగా మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో ఈ అంశంపై మాట్లాడినట్లు తెలిపారు. తెలంగాణ ప్రయోజనాలకు అనుగుణంగా పరిష్కారం కనుగొనేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో సభలు, సమావేశాలకు అనుమతుల అంశంపై స్పందిస్తూ, తెలంగాణలో ఎవరైనా రావచ్చని, రాజకీయ కార్యక్రమాలు నిర్వహించవచ్చని పేర్కొన్నారు. అయితే శాంతిభద్రతలకు భంగం కలిగే అవకాశం ఉన్నప్పుడు మాత్రమే పోలీసులు నిర్ణయాలు తీసుకుంటారని చెప్పారు. ఇదే పరిస్థితి ఇతర రాష్ట్రాల్లో కూడా ఉందని, ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపక్ష నేతల సభల విషయంలోనూ ఇలాంటి నిర్ణయాలు తీసుకున్న సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశారు. ఇక తన వ్యాఖ్యలను వక్రీకరిస్తున్నారంటూ సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని నమ్మే ఏ నాయకుడూ హిట్లర్‌ను ఆదర్శంగా తీసుకోరని స్పష్టం చేశారు. తన వ్యాఖ్యలను సందర్భానుసారంగా కాకుండా వేరే కోణంలో చూపించారని పేర్కొన్నారు. రాష్ట్ర హక్కులు, తెలంగాణ అభివృద్ధి, ప్రజాస్వామ్య పరిరక్షణ అంశాల్లో తమ ప్రభుత్వం రాజీ పడదని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చినా, రాజకీయంగా పోరాడినా రాష్ట్రానికి రావాల్సిన హక్కులు సాధించే వరకు వెనక్కి తగ్గబోమని ఆయన వెల్లడించారు.

# రాజకీయ రంగప్రవేశానికి లారెన్స్ సంకేతాలు

అభిప్రాయపడ్డారు. తన రాజకీయ ప్రయాణం ఎప్పుడు ప్రారంభమవుతుందో, ఎవరితో కలిసి ముందుకు సాగుతానో త్వరలోనే వెల్లడిస్తానని లారెన్స్ తెలిపారు. అయితే తుది నిర్ణయం తీసుకునే ముందు ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవాలని భావిస్తున్నట్లు చెప్పారు. అభిమానులు, ప్రజలు తన నిర్ణయాన్ని స్వాగతిస్తే రాజకీయాల్లోకి వస్తానని, వారు అంగీకరించకపోతే ఆ ఆలోచనను విరమించుకుంటానని స్పష్టం చేశారు. ప్రజల అభీష్టం తనకు అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. లారెన్స్ చేసిన ఈ ప్రకటన తమిళనాడు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించింది. కొంతకాలంగా ఆయన రాజకీయాల్లోకి వస్తారనే ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా ఇటీవల ఏర్పడిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆయన భవిష్యత్ రాజకీయ అడుగులపై అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఆయన కొత్తగా రాజకీయ పార్టీ స్థాపిస్తారా? లేక ఇప్పటికే ఉన్న రాజకీయ శక్తులతో చేతులు కలుపుతారా? అన్న చర్చ సాగుతోంది. ఇటీవలి కాలంలో విజయ్ నేతృత్వంలోని టీవీకేలో లారెన్స్ చేరవచ్చనే ప్రచారం బలంగా వినిపిస్తోంది. ముఖ్యమంత్రి విజయ్ రాజీనామా అనంతరం ఖాళీ అయిన తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గం నుంచి టీవీకే అభ్యర్థిగా లారెన్స్‌ను బరిలోకి దించే అవకాశాలపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆయన తాజా ప్రకటనకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. సినీ రంగంలో విజయవంతమైన ప్రయాణంతో పాటు సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల్లో మంచి గుర్తింపు పొందిన లారెన్స్ రాజకీయాల్లోకి వస్తే తమిళనాడు రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే ఆయన ఏ పార్టీతో కలిసి పనిచేస్తారు? లేక స్వతంత్ర రాజకీయ ప్రస్థానం ప్రారంభిస్తారా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. ప్రజల స్పందనను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తన తదుపరి నిర్ణయాన్ని వెల్లడిస్తానన్న లారెన్స్ వ్యాఖ్యలు ప్రస్తుతం తమిళనాడు రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.

# ఆర్నెల్ల పాపతో దూకిన తల్లి.. అద్భుతంగా బతికిన చిన్నారి

మియాపూర్: నగరంలోని మియాపూర్ మయూరీనగర్‌లో శుక్రవారం సాయంత్రం హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. ఆరు నెలల పసికందును ఒడిలో పెట్టుకుని ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని అపార్ట్‌మెంట్ ఆరో అంతస్తు నుంచి కిందికి దూకి ఆత్మహత్య చేసుకుంది. అయితే విధి వింతగా చిన్నారి ప్రహరీ గోడపై ఉన్న ఇనుప కంచెకు దుస్తులు చిక్కుకోవడంతో ప్రాణాలతో బయటపడింది. తీవ్ర గాయాలతో తల్లి అక్కడికక్కడే మృతి చెందగా, చిన్నారి స్వల్ప గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. మియాపూర్ పోలీసుల వివరాల ప్రకారం, మహారాష్ట్రలోని నాగపూర్‌కు చెందిన భూపేంద్ర సాహు, మధ్యప్రదేశ్‌లోని భూత్‌గావ్‌కు చెందిన ఈషా సాహు (37) 2015లో వివాహం చేసుకున్నారు. గత ఎనిమిదేళ్లుగా మియాపూర్ మయూరీనగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నారు. ఇద్దరూ సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగాలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఎనిమిదేళ్ల పెద్ద కుమార్తెతో పాటు ఆరు నెలల చిన్నారి వాణి ఉంది. ఇటీవల రెండో కాన్పు అనంతరం ఈషా సాహు ప్రసూతి సెలవులో ఉన్నారు. కొంతకాలంగా తల్లిదండ్రుల వద్ద, అనంతరం నాగపూర్‌లోని అత్తారింట్లో గడిపిన ఆమె, పెద్ద కుమార్తె విద్యాభ్యాసం కోసం గత నెల 30న కుటుంబ సభ్యులతో కలిసి తిరిగి హైదరాబాద్‌కు వచ్చింది. అయితే గత కొంతకాలంగా ఆమె తీవ్ర మానసిక ఒత్తిడితో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు, పోలీసులు గుర్తించారు. శుక్రవారం మధ్యాహ్నం ఈషా సాహు తన భర్త భూపేంద్ర సాహు, పెద్ద కుమార్తె విధిని సరుకులు కొనుక్కురావాలని చెప్పి సమీపంలోని డీమార్ట్‌కు పంపించింది. వారు బయటకు వెళ్లిన తర్వాత ఆరు నెలల చిన్నారిని తీసుకుని అపార్ట్‌మెంట్ ఆరో అంతస్తుకు చేరుకుంది. వెంట తీసుకెళ్లిన బకెట్‌పై నిలబడి ప్రహరీ గోడ ఎక్కి చిన్నారితో కలిసి కిందికి దూకింది. కింద పడిన వెంటనే ఈషా సాహు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. అయితే చిన్నారి ధరించిన గౌను అపార్ట్‌మెంట్ ప్రహరీ గోడపై ఉన్న ఇనుప కంచెకు చిక్కుకోవడంతో ఆమె కిందపడకుండా వేలాడుతూ కనిపించింది. స్థానికులు గమనించి వెంటనే పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న మియాపూర్ పోలీసులు దృశ్యం చూసి దిగ్భ్రాంతికి గురయ్యారు. ఒకవైపు మృతదేహం ఉండగా, మరోవైపు ఇనుప కంచెకు వేలాడుతున్న చిన్నారిని జాగ్రత్తగా కాపాడి ఆస్పత్రికి తరలించారు. వైద్యుల పర్యవేక్షణలో చిన్నారి చికిత్స పొందుతోందని, ప్రస్తుతం ప్రమాదం లేదని సమాచారం. సంఘటన స్థలంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న ఓ సూసైడ్ నోట్‌లో ఈషా సాహు తన మనోవేదనను వ్యక్తం చేసినట్లు తెలిపారు. "ఒత్తిడిని తట్టుకోలేకపోతున్నా... మీరందరూ సంతోషంగా ఉండండి... నన్ను క్షమించండి" అని ఆమె రాసినట్లు పోలీసులు వెల్లడించారు. ప్రాథమిక దర్యాప్తులో ఈషా సాహు గత ఆరు నెలలుగా డిప్రెషన్‌తో బాధపడుతున్నట్లు తేలిందని అధికారులు తెలిపారు. ప్రసూతి అనంతర మానసిక ఒత్తిడి కూడా కారణమై ఉండవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. ఒక క్షణంలో కుటుంబాన్ని విషాదంలోకి నెట్టేసిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. తల్లి ప్రాణాలు కోల్పోయినా, అద్భుతరీతిలో చిన్నారి ప్రాణాలతో బయటపడటం అక్కడి వారిని ఆశ్చర్యానికి గురిచేసింది. కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మయూరీనగర్‌లో విషాద వాతావరణాన్ని నెలకొల్పాయి.



## కార్యసిద్ధి హనుమాన్ దేవాలయంలో ఘనంగా మండల పూజా మహోత్సవాలు

కాప్రా, వార్తా మిర్రర్, జూన్ 12 : కుషాయిగూడలోని శ్రీ కార్యసిద్ధి హనుమాన్ దేవాలయంలో మండల పూజా మహోత్సవాలు గురువారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. భారీ హనుమాన్ విగ్రహ ఆవిష్కరణతో పాటు మూలవిరాట్ శ్రీ కార్యసిద్ధి హనుమాన్ స్వామి, శ్రీ మహా గణపతి స్వామి విగ్రహాల ప్రతిష్ఠకు 41 రోజులు పూర్తైన సందర్భంగా ఈ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హంపి పీఠాధిపతి, పరమ పూజ్య శ్రీ శ్రీ శ్రీ జగద్గురువులు విద్యారణ్య భారతి స్వామీజీ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివార్లకు ఔషధీయ మహా అభిషేకం, అఖండ హోమం, ఆలయ సంప్రోక్షణ, భారీ హనుమాన్ విగ్రహ సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 159 దేవాలయాల ప్రతిష్ఠ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిన బ్రహ్మశ్రీ శివ కార్తిక్ శాస్త్రి మాట్లాడుతూ, దేవాలయాల అభివృద్ధికి 'ప్రణాళిక , కార్యక్రమం , నియంత్రణ, అనే మూడు సూత్రాలు అత్యంత ముఖ్యమని అన్నారు. ప్రణాళికతో స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, కార్యక్రమాల ద్వారా ధార్మిక, సాంస్కృతిక, సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని, నియంత్రణ ద్వారా ఆర్థిక వ్యవహారాల్లో పారదర్శకత పాటించాలని సూచించారు. ఈ మూడు సూత్రాల సమన్వయంతో దేవాలయం సమాజానికి ఆదర్శంగా నిలిచి, భవిష్యత్ తరాలకు ఆధ్యాత్మిక మార్గదర్శకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. అనంతరం జగద్గురువులు భక్తులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు చల్లా ప్రభాకర్, యావపురం రవి, పనగట్ల చక్రపాణి గౌడ్, అనిల్ బాబు, రేగొండ వెంకటేశ్వర్లు, సీతారామ శర్మ, నాలచర్ల జనార్ధన్, దయానంద్, పిట్ల రాజు, చల్లా వెంకటేష్, యాదగిరి, బాల్ నరసింహ, శ్రీశైలం, లక్ష్మణ్, రాములు, సుభాష్, అనిల్, రాకేష్, భరత్, దత్తు తదితరులు పాల్గొన్నారు.



## బ్యాండ్ కళాకారుల సదస్సు ను విజయవంతం చేయాలి

కాప్రా, వార్త మిర్రర్, జూన్ 12 : ఆధునిక వృత్తి, ఉపాధి కల్పన సాధనకై ఈ నెల 16న హైదరాబాద్‌లోని సుందరయ్య కళానిలయంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి బ్యాండ్ కళాకారుల సదస్సును విజయవంతం చేయాలని శ్రీ మంజునాథ బ్యాండ్ కళాకారుల సంఘం నాయకులు పిలుపునిచ్చారు. రాష్ట్ర శాఖ పిలుపు మేరకు కుషాయిగూడలోని శివాంజనేయ దేవస్థానం వద్ద సదస్సుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బ్యాండ్ కళాకారులు ఎదుర్కొంటున్న ఉపాధి సమస్యలు, ప్యాడ్ బ్యాండ్ వాహనాల సీజ్‌లు, పోలీసుల వేధింపులపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. బ్యాండ్ కళాకారుల సంక్షేమానికి ప్రత్యేక నిధి ఏర్పాటు చేయడంతో పాటు వడ్డీ రహిత రుణాలు, గుర్తింపు కార్డులు, పెన్షన్ సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సౌండ్ పొల్యూషన్ కంట్రోల్ కమిషన్ ఏర్పాటు చేసి కళాకారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని అన్నారు. మల్కాజిగిరి, ఉప్పల్, మేడ్చల్ నియోజకవర్గాల పరిధిలోని కళాకారులు పెద్ద సంఖ్యలో సదస్సుకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పి. నగేష్, ఉపాధ్యక్షుడు మేడిపల్లి శ్రీశైలం, కోశాధికారి చింతల శేఖర్, అమాస బాలప్ప, చంద్రమౌళి, రామచందర్, ఆంజనేయులు, సి. రాములు తదితరులు పాల్గొన్నారు.

## కాప్రా సర్కిల్ లో అడ్డదిడ్డంగా యూజీడి పైప్లైన్ నిర్మాణం లిజలమండలి ఇంజనీరింగ్ అధికారుల సమన్వయ లోపం



కాప్రా, వార్త మిర్రర్, జూన్ 12 :కాప్రా సర్కిల్లో జలమండలి ఇంజనీరింగ్ అధికారుల మధ్య సమన్వయం లోపం, నిర్లక్ష్యం కారణంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం పనులు అడ్డదిడ్డంగా జరుగుతున్నాయని కాలనీ కమిటీల సమాఖ్య సిసిఎస్ ఆందోళన వ్యక్తం చేసింది. శుక్రవారం కుషాయిగూడ బస్ స్టాండ్ లో జరుగుతున్న యు జి డి పైప్ లైన్ నిర్మాణం పనుల వద్ద స్థానికులతో కలిసి నిరసన వ్యక్తం చేయడం జరిగింది. బస్టాండ్ లో కొత్తగా నిర్మిస్తున్న యు జి డి పైప్ లైన్ మురుగు ప్రవాహానికి అడ్డుగా ఉన్న రెండు తాగునీటి పైప్ లైన్ లను సరిచేయాలని కాలనీ కమిటీల సమాఖ్య సిసిఎస్ అధ్యక్షులు ఎంపల్లి పద్మా రెడ్డి డిమాండ్ చేశారు. జలమండలి ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం తగదంటూ ఎం ఎం సి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి జలమండలి సిజిఎం,జిఎంలు చొరవ చూపాలని డిమాండ్ చేస్తూ మురుగులో నిలబడి నిరసన వ్యక్తం చచేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి చర్లపల్లి డివిజన్ అధ్యక్షులు చల్లా ప్రభాకర్, నాయకులు రేగొండ వెంకటేశ్వర్లు వెంకులు, యావపురం రవి, రమేష్ చౌదరి, దశరథ, దయానంద్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎంసీ జాయింట్ కమిషనర్ తిప్పర్తి యాదయ్యకు స్వేరోస్ ప్రతినిధుల శుభాకాంక్షలు



సికింద్రాబాద్, వార్త మిర్రర్ జూన్ 12 : మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) జాయింట్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన తిప్పర్తి యాదయ్యను శుక్రవారం తార్నాకలోని ఆయన కార్యాలయంలో స్వేరోస్, టీఎస్‌పీఏ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో ఘనంగా సత్కరించి నూతన బాధ్యతల్లో విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించడంతో పాటు కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని కోరుతూ ప్రతినిధులు ఆయనతో పలు అంశాలపై చర్చించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు సేవాభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్వేరోస్ హైదరాబాద్ నగర కార్యదర్శి కుమార్ షాను, టీఎస్‌పీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీ ఆనంద్‌తో పాటు పలువురు సామాజిక కార్యకర్తలు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కమిషనర్ తిప్పర్తి యాదయ్యకు నూతన బాధ్యతల్లో విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ అభినందనలు తెలియజేశారు.

# కల్వకుర్తి కోర్టులో ఉచిత కంటి వైద్య శిబిరం.

### - ప్రారంభించిన సీనియర్ కోర్టు సివిల్ జడ్జి ఏం.రాజు



కల్వకుర్తి జూన్ 12 వార్త మిర్రర్ ప్రతినిధి:- ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కల్వకుర్తి కోర్టు సీనియర్ న్యాయమూర్తి ముదిగొండ రాజు అన్నారు. శుక్రవారం కల్వకుర్తి కోర్టు ఆవరణలో శ్రీ నేత్రాలయ ఐ హాస్పిటల్, కొత్తపేట ఆరెంజ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో, కల్వకుర్తి కోర్టు అసోసియేషన్ సౌజన్యం లో ఏర్పాటు చేసిన ఉచిత మెగా హెల్త్ క్యాంప్ ను కల్వకుర్తి కోర్టు సీనియర్ న్యాయమూర్తి ముదిగొండ రాజు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయమూర్తి ముదిగొండ రాజు మాట్లాడుతూ మనిషిలో నిబిడీకృతమైన రుగ్మతలను గుర్తించడానికి ఈ ఉచిత వైద్య శిబిరాలు ఎంతో దోహదపడతాయని ఆయన అన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో కంటి పరీక్షల తో పాటు బిపి, షుగర్, ఈసీజీ వంటి పరీక్షలు నిర్వహించి , పలు ఉగ్మతలు ఉన్న వారికి మందులను ఉచితంగా అందజేయడం అభినందనీయమన్నారు. అనంతరం కల్వకుర్తి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. మల్లేష్, ప్రధాన కార్యదర్శి జమీల్ అహ్మద్ లు మాట్లాడుతూ శ్రీ నేత్రాలయ కంటి ఆస్పత్రి, ఆరెంజ్ ఆస్పత్రి వారు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, పలు రుగ్మతలను గుర్తించి వారికి మందులను అందజేయడం అభినందనీయమన్నారు. అవసరమున్న వారికి మందులను, కంటి అద్దాలను అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పూజిత, సీనియర్ న్యాయవాదులు వెంకట్ రెడ్డి, లక్ష్మీనారాయణ, వెంకట్ గౌడ్, భాస్కర్ రెడ్డి, కే.వెంకటరమణ, నరేందర్ రెడ్డి, లక్ష్మణ్ రాజు, ఉపాధ్యక్షుడు నాగరాజు, ట్రెజరర్ బి. ప్రశాంత్, జాయింట్ సెక్రటరీ ఆంజనేయులు, ప్రెస్ సెక్రటరీ రాంగోపాల్, మల్లెపల్లి జగన్, ఎముక జంగయ్య, పి. శివకుమార్ , శ్రీను, బి. మల్లేష్ యాదవ్ , శ్రీకాంత్ , సీనియర్ కోర్టు సూపర్డెంట్ పార్వతమ్మ, జూనియర్ కోర్టు సూపర్డెంట్ సత్యం, కోర్టు పోలీసులు ,కోర్టు ఉద్యోగులు, ఆస్పత్రి సిబ్బంది రాము, దివ్య దీపికా పల్లవి రాకేష్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయంలో కుంకుమ పూజలు

### అమ్మ వారికి ముడుపు సమర్పణ



వార్త మిర్రర్ జగిత్యాల ప్రతినిధి జూన్ 12

జగిత్యాల పట్టణశీ చింతకుంట లోని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయం లో శ్రీ ధనలక్ష్మి సేవా సమితి అధ్వర్యంలో అధిక జ్యేష్ట మాసం శుక్రవారం ద్వాదశి పర్వదినం పురస్కరించుకొని, మాతలు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన, లలితా సహస్ర నామాల స్థోత్ర పారాయణం చేసారు. పారాయణం అనంతరం మాతలు అమ్మ వారికి ఓడి బియ్యం సమర్పించారు. కుంకుమ పూజ అనంతరం లక్కీ డిప్ ద్వార ఒక్కరిని ఎంపిక చేసి వారికి అమ్మ వారి శేష వస్త్రం, అమ్మ వారి ప్రసాదం, తాంబూలం ఆలయ పూజారి ఆశీర్వచనములతో బహుకరించడం జరిగినది. తదనంతరం అమ్మ వారికి ముడుపులు కట్టారు. ఈ కార్యక్రమము నందు దేవాలయ ట్రస్ట్ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ వడ్లగట్ట రాజన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ వొడ్నాల శ్రీనివాస్, మహిళా సభ్యులు వొడ్నాల లత, వొడ్నాల సునీత, హర్షిణి, శ్రీలత, పల్లవి, వినాత్రి, గంగమ్మ, అర్చకులు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# మల్టీ పర్పస్ వర్కర్ రద్దు చేయాలి.జీవో నెంబర్ 51 నీ సవరించాలి

### ఆన్ లైన్లో పేర్లు నమోదు చేయాలి,

### జూన్ నెల నుండి ప్రతి నెల నెల ఒకటో తేదీన వేతనాలు ఇవ్వాలి ,



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జూన్ 12

రాష్ట్ర వ్యాప్తంగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మల్టీ పర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని జీవో నెంబర్ 51 నీ సవరించాలని పాత పద్ధతిలోనే కేటగిరీల వారిగా విధులు నిర్వహించాలని ఆన్ లైన్లో పేర్లు నమోదు చేయాలని, చనిపోయిన కార్మికులకు ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని, చనిపోయిన వారి కుటుంబములో ఒకరికి ఉద్యోగాలు ఇవ్వాలి గ్రామ పంచాయతీ కార్మిక సిబ్బంది కి రెండవ పిఆర్ సి వర్తింపచేసి వేతనాలు పెంచాలని ముఖ్యమంత్రి ఐఏఎస్, ప్రభుత్వ ఉద్యోగుల తరహాలోనే గ్రామ పంచాయతీ కార్మిక సిబ్బంది కి ప్రతి నెల ఒకటో తేదీన గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని, ఈ వేతనాల విషయములో జాప్యం జరిగితే సహించేది లేదని ఆదేశించించడం వలన హర్షం వ్యక్తం చేస్తున్నాము. కానీ గత ఏడాది ఈ కార్మికులను మోసం చేసినట్లు ఇప్పుడు మోసం చేయకుండా ఇచ్చిన వాగ్దాన హామీలు అమలు చేయాలి. ఎన్నికలకు ముందు ఇచ్చిన మ్యాన్ పేస్టు అమలు చేయాలని ఇన్సూరెన్స్, ప్రావిడెంట్ ఫండ్, రిటైర్మెంట్ బెనిఫిట్ అమలు చేయాలని పదవ తరగతి పాసు అర్హత ఐదు సంవత్సరాల అనుభవం ఉన్నవారికి పంచాయతీ కార్యదర్శులుగా ప్రమోషన్ ఇవ్వాలి. కారొబర్, బిల్ కలెక్టర్లకు స్టేటస్ ఇవ్వాలి. తక్షణమే అమలు చేయాలని లేని పక్షములో భవిష్యత్ లో మరో నిరవదిక సమ్మె పోరాటశీలోకి వెళ్తామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఈ డిమాండ్ల పరిష్కార మార్గం కొరకు ఈ రోజు రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో బాగంగా జగిత్యాల జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారికి ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి మాకు న్యాయం చేయాలని కోరుతూ వినత పత్రం సమర్పించడం జరిగింది. ఈ ధర్నాలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జగిత్యాల జిల్లా గౌరవ అధ్యక్షులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు పులి మల్లేశం, జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోమటి చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి జంగిలి ఎల్లయ్య, నాతరి మల్లవ్వ, మ్యాకల పోచయ్య, మ్యాకల లింగయ్య , సత్తయ్య ,బేతి అంజన్న, రాజేశం , జోగవ్వ ఇందారపు పద్మ, గుడిసె దేవయ్య, శంకర్ ( రాయికల్ ), ఎవుసం కొండయ్య, ఉప్పులపు పోసాని, గ్రామ పంచాయతీ కార్మిక సిబ్బంది పాల్గొన్నారు.

# మేడ్చల్ జిల్లాలో అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ ఇంకెప్పుడు

### లోపించిన పారదర్శకత

### కార్డులో నాణ్యత లోపాలు

### విభజించి పాలిస్తున్న డిపిఆర్ఓ



16 తో ముగుస్తున్న బస్సు పాస్ గడువు మేడ్చల్ జిల్లా ప్రతినిధి, వార్త మిర్రర్, జూన్ 12 :మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో అక్రిడిటేషన్ కార్డుల మంజూరులో పూర్తిగా పారదర్శకత లోపించిందని విమర్శలు వినిపిస్తున్నాయి. కార్డులో నాణ్యత లోపంపై సీనియర్ జర్నలిస్టులు తీవ్రంగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు తప్పుల తడకగా ముద్రించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో 2022లో మంజూరు చేసిన అక్రిడిటేషన్ల స్థానంలో సుమారు నాలుగు సంవత్సరాల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వంలో అక్రిడిటేషన్లు ఇవ్వడానికి అధికారులు సవాలక్ష సాకులను చూపించి జర్నలిస్టులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇప్పటికే సుమారు 6 సార్లు పాత అక్రిడిటేషన్లను రెన్యువల్ చేశారు. మే 10వ తేదీలోగా అక్రిడిటేషన్లు ఇవ్వాలని ఉన్నతాధికారుల ఆదేశాలు ఉన్నప్పటికీ జిల్లా స్థాయిలో నిబంధనల సాకుతో పెద్ద మీడియా, చిన్న మీడియా అంటూ మీడియాను వేరుచేసి అధికారులు విభేదాలకు ఆజ్యం పోస్తున్నారు. దీంతో అక్రిడిటేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ మరోసారి చర్చనీయాంశంగా మారింది. అక్రిడిటేషన్ కమిటీ నియామకంలో సైతం పారదర్శకత లోపించడం, అధికారులకు అక్రిడిటేషన్ జారీపై ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను సైతం లెక్కచేయకుండా జర్నలిస్టులను ఇబ్బందులు గురి చేస్తున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. దరఖాస్తు చేసుకున్న వారికి వరుసగా అక్రిడిటేషన్లను మంజూరు చేయకుండా పెద్ద మీడియాకు మంజూరీ చేశాం. చిన్న మీడియాకు చేస్తామని సమాధానం ఇవ్వడంలో అంతర్యం ఏమిటో అర్థం కావడం లేదు. మీ పేపర్ మా కార్యాలయానికి రావడం లేదు. కాబట్టి మీకు అక్రిడిటేషన్ ఇవ్వడం కుదరదని చెప్పడంలో ఆంతర్యం ఏమిటి. ఒక వేళ పేపర్లు పంపిస్తే బిల్లు ఎవరు ఇస్తారో అధికారులు తేల్చి చెప్పాలి. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పత్రికకు అర్హత ఉన్న మేరకు అక్రిడిటేషన్లకు దరఖాస్తు చేసుకుంటే పేపరు రావడం లేదని,చిన్న పేపర్లకు తర్వాత ఇస్తామని, సాకులు చెబుతూ కాలయాపన చేయడంపై ఉన్నతాధికారులు దృష్టి సాధించాలని జర్నలిస్టులు కోరుతున్నారు. అక్రిడిటేషన్ కార్డు అనేది కేవలం గుర్తింపు పత్రం మాత్రమే కాదని, ప్రభుత్వ కార్యక్రమాల్లో అధికారిక ప్రవేశం, సమాచార సేకరణలో సౌలభ్యం, జర్నలిస్టుల సంక్షేమ పథకాల ప్రయోజనాలకు కీలక ఆధారంగా భావిస్తారు. దీంతో కార్డుల కేటాయింపు ప్రక్రియలో నిష్పక్షపాత విధానం ఉండాలని జర్నలిస్టులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా, మండల స్థాయిలో పని చేస్తున్న పలువురు విలేకరులు తమ దరఖాస్తులు అన్ని నిబంధనలకు అనుగుణంగా ఉన్నప్పటికీ సాకులు చెబుతూ కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అర్హతల పరిశీలనలో స్పష్టత లేకపోవడం, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం కార్డులను మంజూరీ చేయకపోవడం వెనుక పలు అనుమానాలు తలెత్తుతున్నాయని పేర్కొంటున్నారు. అక్రిడిటేషన్ మంజూరుకు సంబంధించి దరఖాస్తుదారుల వివరాలు, ఎంపిక ప్రమాణాలు, తిరస్కరణకు గల కారణాలను అందుబాటులో ఉంచాలని జర్నలిస్టులు డిమాండ్ చేస్తున్నారు. దీంతో పారదర్శకత పెరగడంతో పాటు అనవసర వివాదాలకు కూడా చెక్ పడుతుందని అభిప్రాయపడుతున్నారు. అదే విధంగా అక్రిడిటేషన్ మంజూరీ ప్రక్రియపై స్వతంత్ర సమీక్ష నిర్వహించి, అర్హులైన విలేకరులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని జర్నలిస్టులు కోరుతున్నారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుని అర్హులందరికీ అక్రిడిటేషన్ సౌకర్యం కల్పించే విధంగా వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని మీడియా వర్గాలు సూచిస్తున్నాయి.

# కేజ్-ఫ్రీ, ఫ్రీ-రేంజ్ గుడ్లతో అభి ఎగ్స్ విస్తరణ....

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : న్యూట్రి-ఎన్‌రిచ్డ్ ఎగ్ బ్రాండ్ అభి ఎగ్స్ తన ప్రీమియం ఉత్పత్తుల శ్రేణిని విస్తరిస్తూ కేజ్-ఫ్రీ, ఫ్రీ-రేంజ్ ఎగ్ వేరియంట్లను మార్కెట్లో ప్రవేశపెట్టింది. అభి ఫుడ్స్‌కు చెందిన ఈ బ్రాండ్ 2020లో ప్రారంభమైనప్పటి నుంచి పోషక విలువలు కలిగిన గుడ్ల ఉత్పత్తిలో ప్రత్యేక గుర్తింపు పొందగా, 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.100 కోట్లకు పైగా ఆదాయం నమోదు చేసింది. పూర్తిగా నియంత్రిత, యాంటీబయాటిక్-రహిత ఫార్మింగ్ విధానంలో ఉత్పత్తి చేస్తున్న అభి ఎగ్స్, వినియోగదారులలో పెరుగుతున్న నాణ్యత, పారదర్శకత, నైతిక ఫార్మింగ్ పద్ధతులపై అవగాహనకు అనుగుణంగా ఈ కొత్త వేరియంట్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రస్తుతం రోజుకు 18 నుంచి 20 లక్షల గుడ్ల ఉత్పత్తి సామర్థ్యంతో పనిచేస్తున్న సంస్థ, భారతదేశపు తొలి డీ .ఓ .ఎస్ .ఈ.ఎగ్ తో పాటు విటమిన్ డీ3, న్యూట్రిం, గోల్డ్‌ం మరియు తాజా కేజ్-ఫ్రీ, ఫ్రీ-రేంజ్ వేరియంట్లను వినియోగదారులకు అందిస్తోంది. దేశవ్యాప్తంగా 17 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల్లోని 50 నగరాల్లో ఆధునిక రిటైల్, ఈ-కామర్స్, క్విక్ కామర్స్ వేదికల ద్వారా అందుబాటులో ఉన్న అభి ఎగ్స్, మధ్యప్రాచ్యం మరియు ఆగ్నేయాసియా దేశాల్లో ఎగుమతి అవకాశాలను కూడా అన్వేషిస్తోంది.



## తార్నాకలో జూన్ 13, 14 తేదీల్లో ఓటర్ల వివరాల సవరణ కార్యక్రమం నిర్వహిస్తున్న బీఆర్ఎస్



సికింద్రాబాద్, వార్త మిర్రర్ జూన్ 12: తార్నాకలోని సండే మార్కెట్ ప్రాంతంలో జూన్ 13, 14 తేదీల్లో "పద్ధతిబద్ధమైన ఓటర్ల ప్రోత్సాహక సవరణ కార్యక్రమం" నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గుండెల్లి మధుకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటర్లందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ ఓటరు వివరాలను పరిశీలించి, అవసరమైన సవరణలు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఓటరు జాబితాలో పేర్లు, చిరునామా, ఇతర వ్యక్తిగత వివరాలను సరిచూసుకోవడం ద్వారా ప్రజాస్వామ్య ప్రక్రియను మరింత బలోపేతం చేయవచ్చని ఆయన పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు వివరాలు ఖచ్చితంగా ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి సంబంధించి ఏవైనా సందేహాలు లేదా సహాయం అవసరమైన వారు హెల్ప్‌లైన్ నంబర్ 98853 65000ను సంప్రదించాలని ఆయన తెలిపారు. ప్రజల భాగస్వామ్యం ప్రజాస్వామ్య వ్యవస్థకు బలమని, ప్రతి ఓటరు తన వివరాలను ధ్రువీకరించుకోవడం ఎంతో ముఖ్యమని గుండెల్లి మధుకర్ పేర్కొన్నారు.



## ప్రమాదవశాత్తు ఈత వనం దగ్ధం

వార్త మిర్రర్ రాయికల్ జూన్ 12

జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలో శుక్రవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని దాదాపు 5 ఎకరాలలో ఉన్న ఈతవనాలు దగ్ధమయ్యాయి. రాయికల్ పట్టణ గౌడ సంఘానికి చెందిన స్థానిక ఇటిక్యాల రోడ్డులో గల శివారులోని ఈత వనానికి మంటలు చెలరేగి సుమారు 800 చెట్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఘటన స్థలంలో ఉన్న గీత కార్మికులు ఫైర్ ఇంజిన్‌కు ఫోన్ చేసినప్పటికీ, ఫైర్ ఇంజిన్ వచ్చేసరికి చెట్లు పూర్తిగా కాలిపోయి నష్టం వాటిల్లింది. నష్టపోయిన గీత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని గౌడ సంఘం వారు కోరుతున్నారు.

## హెచ్.బి. కాలనీలో స్మశాన వాటికను ఆధునికరించాలి



కాప్రా, వార్త మిర్రర్, జూన్ 12 : మీర్పేట్ హౌసింగ్ బోర్డ్ డివిజన్ పరిధిలోని సుమారు 20 కాలనీలకు సంబంధించిన స్మశాన వాటికను ఆధునికరించాలని బిజెపి హెచ్ బి కాలనీ డివిజన్ అధ్యక్షుడు రామ్ ప్రదీప్ మునిగంటి ఎం ఎం సి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని సుమారు 20 కాలనీల ప్రజలు ఉపయోగిస్తున్న శ్మశానవాటికను ఆధునికీకరించాలని కోరుతూ, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఇచ్చిన లేఖను కమిషనర్ కి అందజేశారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించే విధంగా శ్మశానవాటికలో అవసరమైన మౌలిక వసతులు, అభివృద్ధి పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డి సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## నిబంధనలకు విరుద్ధంగా వేస్తున్న బోర్లు

### - తగ్గుతున్న భూగర్భ జలాలు
### వెలువతున్న కాలుష్యం



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జూన్ 12 జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలో నిర్మాణాల పేర విచ్చల విడిగా బోర్ వెల్ వేసి భూగర్భ జలాలు తరుగుదలకు కారణం అవుతున్నారు. దాంతో పాటు బోర్ వేసేటప్పుడు వెలువడుతున్న దుమ్ము ధూళి కాలుష్యం అట్టి పరిసరాలలో జీవించే ప్రజలకు ఇబ్బందిగా మారుతుంది. బోర్ వేసిన నీరు చోట పడకుంటె పదే పదే స్థలాన్ని మర్చి బోర్ వెయ్యడంతో ఆయా కాలనీల ప్రజలకు ఇబ్బందిగా మారింది. పురపాలక సంఘం పరిధిలో రోజు కు పది నుండి ఇరువై బోర్లు వేస్తుండగా వాటిలో ఒక్క దానికి కూడ ప్రభుత్వ అనుమతి లేనట్లు సమాచారం. జల , భూమి, వృక్షాల చట్టం (వాల్టా), 2002, ను అనుసరించి సుస్థిర పర్యావరణ పద్ధతులను ప్రోత్సహించడానికి భారతదేశంలో (ప్రధానంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో) అమలు చేయబడిన ఒక సమగ్ర నియంత్రణ. ఇది కాలుష్యాన్ని నివారించడానికి మరియు సహజ వనరులను రక్షించడానికి భూగర్భ/ ఉపరితల నీటి వినియోగాన్ని నిర్వహిస్తుంది. భూగర్భ జల నియంత్రణ: అన్ని బోర్వెల్ల నమోదును, ముఖ్యంగా త్రాగునీటి వనరుల సమీపంలో డ్రిల్లింగ్ కోసం అనుమతిని తప్పనిసరి చేస్తుంది చేస్తోంది. నిబంధనలను ఉల్లంఘిస్తే ఒక సంవత్సరం నుండి ఐదు సంవత్సరాల వరకు కూడ జైలు శిక్ష పాడే అవకాశం ఉంది.

### తగ్గుతున్న భూగర్భజలాలు:

నిబంధనలకు విరుద్ధంగా విచ్చల విడిగా ఆవారానికి మించిన లోతుగా బోరు వెల్ వెయ్యడంతో భూగర్భ జలాలు అంతరించి పోతున్నాయి. ప్రస్తుతశీ వేసవి కాలం కావడంతో నీటి కొరత భారీగా ఏర్పడే అవకాశం ఉంది. ప్రజలకు నీటిని పొదుపుగా వాడుకోవలసిన అవసరంఎంతయిన ఉంది. దాంతో పాటు భూగర్భ జలాల రక్షణకు అధికారులు తగు చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది.

### బోర్ వెల్ వేస్తున్నప్పుడు కాలుష్యం:

పట్టణంలో విచ్చలవిడిగా బోర్ బావులు వెయ్యగా దాంతో వెలువడుతున్న దుమ్ము దూళి కాలనీ మొత్తం దుమ్ము వ్యాపిస్తుంది. ఒకసారి బోర్ పడకుంటె మరో చోట రిపీటెడ్ గా అదే స్థలం ప్రాగణంలో వెయ్యడంతో ఒకటే రెండు రోజులు బోర్ డ్రిల్లింగ్ నడుస్తోంది. దాంతో ప్రజలు మరింత ఇబ్బందులు పడి శ్వాసకోశ వ్యాధుల భారీన పడుతున్నారు.

## మల్లాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు తీసుకోండి

### అడ్మిషన్స్ పెంచుటకు అధ్యాపకుల ఇంటింటి ప్రచారం



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జూన్ 12

2026- 27 విద్యా సంవత్సరానికి గాను మల్లాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులు ఇంటర్ ఫస్టియర్ అడ్మిషన్ల పెంచుటకు ఊరూరు, గడపగడప తిరిగి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రత్యేకతలు తెలియజేస్తూ అధ్యాపకులు ప్రచారం చేస్తున్నారు.

### ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రత్యేకతలు:

సువిశాలమైన తరగతి గదులు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివిన విద్యార్థులకు ఇంటర్ తర్వాత ఇంజనీరింగ్ కోర్స్ పూర్తి ఉచితం. అనుభవజ్ఞులైన అధ్యాపకులు. ప్రభుత్వం కలీ పించే ఉచిత మధ్యాహ్న భోజనం, ఉదయం అల్పాహారం, త్రాగడానికి ఫిల్టర్ వాటర్. వీటితోపాటు క్లాసులో ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ,అన్ని విషయాలు ప్రతి విద్యార్థిని విద్యార్థులకు మరియు తల్లిదండ్రులకు తెలియజేస్తూ గొర్రెపల్లి, వివిరావుపేట్, రేగుంట, రాఘవపేట్, మల్లాపూర్ మండలంలోని ప్రతి గ్రామానికి వెళ్లి ప్రచారం చేస్తున్నారు. ఈ ప్రచారంలో అధ్యాపకులు సంతోష్ కుమార్, నంచర్ల రాజేష్ రాజేందర్ మహేష్ శ్రీనివాస్ నరేష్ పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

### జిల్లాలో జర్నలిస్టులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తాం
### త్వరలో యూనియన్ సభ్యులకు ఐడి కార్డులు అందజేస్తాం
### యూనియన్ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి
### టియుడబ్ల్యూజే ఐజేయు జిల్లా అధ్యక్షుడు చీటి శ్రీనివాసరావు



వార్త మిర్రర్ జగిత్యాల ప్రతినిధి జూన్ 12

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేసి రాబోయే తరానికి ఆదర్శంగా నిలిచే విధంగా యూనియన్ కార్యక్రమాలు చేపడుతున్నామని టియుడబ్ల్యూజే ఐజేయు జిల్లా అధ్యక్షుడు చీటి శ్రీనివాసరావు అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తా సమీపంలో గల టియుడబ్ల్యూజే ఐజేయు అనుబంధ ప్రెస్ క్లబ్ లో శుక్రవారం జిల్లా అధ్యక్షుడు చీటి శ్రీనివాసరావు అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా కార్యవర్గ సభ్యుల సహాయ సహకారాలు ఉంటేనే జర్నలిస్టుల సంక్షేమం కోసం వినూత్న కార్యక్రమాలు చేపట్టి సక్సెస్ అవుతాం అన్నారు. జిల్లాలోని యూనియన్ సభ్యులందరికీ ఐడి కార్డులు అందజేసే దిశగా పని చేస్తున్నామని, అందులో 70 శాతం కార్డులు పూర్తయ్యాయని తెలిపారు. మిగతా సభ్యుల వివరాలు త్వరగా పంపిస్తే ఈ నెలాఖరు వరకు ఐడి కార్డులు పంపిణి చేయనున్నట్టు వివరించారు. అక్రిడేషన్ కార్డుల పట్ల అపోహలు వద్దని, అర్హులైన ప్రతి ఒక్క జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డు అందేలా యూనియన్ పక్షాన కృషి చేస్తామన్నారు. జిల్లాలో అక్రిడేషన్ కార్డుల జారీ పక్రియ ఇంచార్జి డిపిఆర్వో వల్ల జాప్యం జరిగిందన్నారు. జిల్లాలో అన్ని పత్రికలకు జివో ఆదారంగా 450 కి పైగా కార్డులు ఇవ్వడానికి కమిటి ఆమోదం తెలిపిందన్నారు. అర్హులకు కార్డు రాకపోతే కొట్లాడదాం కాని అనర్హులు మాత్రం కార్డు పొందరాదన్నారు. జర్నలిస్టులుగా సమాజం కోసం పని చేసే అర్హులైన వారందరికీ కార్డులను అందజేసేలా చూస్తామన్నారు. వృత్తిలో కొనసాగుతున్న జర్నలిస్టులందరికీ మొదటి విడత కార్డులు జారీ చేస్తారని వివరించారు. జిల్లాలో జర్నలిస్టుల కోసం శిక్షణా తరగతులు పెట్టుకోవాలని రాష్ట్ర కార్యవర్గానికి తెలిపామని, మీడియా అకాడమి తరుపున శిక్షణా తరగతులు నిర్వహిస్తారన్నారు. ఈ శిక్షణా తరగతులకు 50 నుండి 60 మంది జర్నలిస్టులే అర్హులు కావున జిల్లాలో 3 చోట్ల శిక్షణా తరగతులు కావాలని అకాడమీ చర్మెన్ ను కోరామని చెప్పారు. త్వరలోనేనియోజకవర్గాల వారీగా ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తాం అన్నారు. త్వరలో జర్నలిస్టులకు, వారి కుటుంబాలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించేలా అధికారులతో చర్చించామన్నారు. యూనియన్ కార్యవర్గ సభ్యులు కార్యక్రమాల విషయంలో నిర్లక్ష్యం చేయకుండా జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో ముందుండాలని పిలుపునిచ్చారు. యూనియన్ పక్షాన జర్నలిస్టులకు క్రీడా పోటీలు నిర్వహిస్తాం అని అన్నారు. యూనియన్ ప్రాతినిధ్యంలేని మండలాలకు ప్రాతినిధ్యం ఇచ్చి ఈసి మెంబర్లను నియమించాలని సూచించారు. త్వరలో జిల్లా కార్యవర్గానికి ఉప కమిటీలు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. సీనియారిటీ ఉన్న వారికి ఉప కమిటిల్లో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతి నెల జిల్లా కార్యవర్గ సమావేశానికి హాజరు కాని వారిని కార్యవర్గం నుండి తొలగిస్తాం అన్నారు. ప్రైవేటు విద్యా సంస్థల్లో చదివే జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో 50 శాతం రాయితీ కల్పించాలని కలెక్టర్ ను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని, త్వరలోనే అన్ని మండలాల ఎం ఈ ఓలకు సర్క్యులర్లు అందుతాయన్నారు. అదేవిధంగా యూనియన్ ను విచ్చిన్నం చేసే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తాం అని హెచ్చరించారు. ఫీల్డ్ లో లేని వారిని యూనియన్ నుంచి తొలగించడం జరుగుతుందన్నారు. కార్యవర్గ సభ్యులందరూ యూనియన్ పటిష్టతకు విభిన్న కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బెజ్జెంకి సంపూర్ణ చారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగుల గోపాల్ చారి, ఉపాధ్యక్షులు గడ్డల హరికృష్ణ, హైదర్ అలీ, అల్లే రాము, లోక రమణా రెడ్డి, కోశాధికారి సిరిసిల్ల వేణు గోపాల్, సహాయ కార్యదర్శులు గుర్రం చంద్ర శేఖర్, కోరేపు రాజ్ కుమార్, చింత నరేష్, కార్యవర్గ సభ్యులు మనోజ్, శంకర్ గౌడ్, రఘుపతి రెడ్డి, హరీష్, నరేష్, సాజీద్, జమీర్ అలీ, గౌస్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## కర్మ అంటే ఏమిటి మనసులో చేసే భావనలు కూడా కర్మ చేసినట్లుగానే భావిస్తార?

### త్రికరణాలు అనేది తరచుగా వినే మాట.
### మనసు, వాక్కు, శరీరం ---ఈ మూడూ ఏ పనికైనా ఆధారం.




వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జూన్ 12

మనం అందరమూ మనసులో సంకల్పించుకొని , విధానం ఆలోచించి , మాటలతో, చేతలతో ఆ పని నిర్వహిస్తాం . అపుడు త్రికరణ ఐక్యం ఏర్పడినట్టు. మహాత్ములు కేవలం సంకల్పిస్తే చాలు .. ఆ బలంతోనే పని అయిపోతుంది. ఒకరికి శుభం కలగాలి అని మనసులో అనుకొంటారు. జరుగుతుంది. ఇది అనుభవసిద్ధం. సాధారణంగా ఏ అవయవంతో చేస్తే దానితో అనుభవించాలి--- అంటారు. ఇపుడు కాకపోతే వచ్చే జన్మలో ఐనా. చూడకుండా ఎవరినైనా తొక్కితే / కాలు తగిలితే "కళ్ళు పోతాయి.. అలా చేయకు " అంటూ ఉంటారు. రామకృష్ణ పరమహంస కాళికాలయం నిర్వహణ బాధ్యత చేపట్టిన ఆమె రాణీ రాసమణి. ఆమె పరమహంస దగ్గరకు వచ్చింది. అమ్మవారికి అక్కడున్న పూలు మాలగా కట్టమన్నాడు ఆయన. ఆమె మాలగుచ్చుతూ ఏదో తన కుటుంబవిషయం ఆలోచిస్తూ ఉన్నది. పరమహంస వచ్చి ఒక పీకు పీకాడు. అమ్మవారికి సమర్పణకోసం గదా సిద్ధం చేయడం. అన్యభావనతో చేస్తే ఆ మాల కళంకితమౌతుంది. ధారణకు పనికిరాదది--- అని ఆయన కోపం. ఆమె తప్పు తెలుసుకొన్నది. ఇక్కడ మానసిక కర్మ ఫలితం ఇచ్చింది. కర్ణుడు చిన్న పెద్ద అంతరం తెలుసుకోక వాగ్దోషాలెన్నో చేశాడు.. శిశు పాలుడూ నోరుపారేసుకొన్నాడు. అప్పుడే ఫలితం కనబడింది. కలియుగంలో మనసులో ఒక వెధవ పని చేయాలి అనుకొంటే అంత తీవ్రఫలితం ఉండదట. మంచిపనికి మాత్రం చేయాలి అని అనుకొంటేనే ఫలితం అబ్బుతుందట. ఈ యుగం నానా కల్మషాలతో ఉన్నది ; మంచిపనులు తేలికగా ఫలరూపం చెందవు అని ఈ వెసులుబాటు. ఈ యుగంలో అహం కాశీం గమిష్యామి అని మంచి ఆలోచన చిత్తశుద్ధిగా చేస్తే చాలు. కాశీకి వెళ్లిన పుణ్యం వస్తుంది. ఈ కాలం అంత కుటిలమైనదని... ఇపుడు మంచి పనులేవీ తేలికగా నెరవేరవు అని. అలాగే చెడుపని నిజంగా చేస్తేనే పాపం ఏర్పడుతుంది..పరిసరాల ప్రభావం వల్ల దుష్టమైన ఆలోచనలే వస్తూ ఉంటాయి ఈ యుగంలో. ఎక్కడో పుణ్యభూముల్లో ఉంటే బుద్ధిమీద ఆ స్థలం పుణ్యప్రభావం చూపుతుందేమో. తారడవి నుండుట మేలు నిశాచరాగ్రణీ! అంటాడు ప్రహ్లాదుడు తండ్రితో. (ఇక్కడ అడవి అంటే తపోవనం అని అతడి భావన.) వెనకటి యుగంలో కథ. కచదేవయాని కథలో దేవయానికి కచుడి మీద మనసయింది. ఇది తగినదా? కాదా? అని ఆలోచన చేసుకోకుండా " నీవును బ్రహ్మచారివి, వినీతుడవేనును కన్యను"--- అని తన వలపు వెళ్లబోస్తుంది. కచుడు" నీవు నాకు గురుపుత్రివి." ( అనేకమంత్రాలు మృతసంజీవనితోపాటు ఉపదేశించాడు. ఈమె తండ్రి శుక్రాచార్యులు.) నీవు నాకు సోదరివి. ఇలాంటి ఆలోచన రావడమే తప్పు" . అది మనసు దాటి వాక్కు దాకా రానీయడం మహాపరాధం అంటూ నిన్ను బ్రాహ్మణుడు వివాహమాడకుండుగాక అని శపించాడు. బ్రాహ్మణులలో కన్యను తగిన వరుడికి తండ్రి దానం చేయడం మాత్రమే ఆచారం. ఈమెయేమో--- క్షత్రియులకు తగిన స్వయంవరణం చేసింది గాబట్టి --- నీకా వివాహమే తగినదౌతుంది అని కచుడన్నాడు. ఇక్కడ మనోభావం వాక్కు స్థాయికి రావడం కారణమయింది. కానీ, ఉపాధిని బట్టి ఫలితం ఉంటుంది. విశేషజ్ఞుడు విజ్ఞతతో ఆలోచనలు చేయాలి. ఒక స్థాయికి వచ్చినవాళ్లు తమకు అనుచితమైన ఆలోచనలు పనులు చేయడం అధిక కష్టం కలిగిస్తుంది. సామాన్యుడు పెద్ద తప్పులకు తక్కువ శిక్ష పొందవచ్చు. ఉన్నతుడికి చిన్నతప్పే పెద్ద శిక్షకు కారణమౌతుంది.

**తిరుమల శంకర్**

## చౌటుప్పల్ ట్రాఫిక్ సీఐగా వెంకటేశం బాధ్యతల స్వీకరణ

### రోడ్డు ప్రమాదాల నివారణ ట్రాఫిక్ నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తా.!



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధిచౌటుప్పల్ ట్రాఫిక్ సీఐగా నందగిరి వెంకటేశం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిపై పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా ట్రాఫిక్ నిర్వహణను మరింత పటిష్ఠం చేస్తామని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారురెడ్డిబావి గ్రామానికి చెందిన వెంకటేశం బాధ్యతలు చేపట్టడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు

## మైలేజ్ కింగ్ అంటే ఇదే..

### 70 కిలోమీటర్ల మైలేజ్.. ధర కేవలం రూ.80 వేలే..!

దీవర్ వీఅశ్రీమ్ఘుస్త్రవ దీఅనివ: మార్కెట్లో రకరకాల బైక్‌లు ఉన్నాయి. కానీ చాలా మంది మంచి మైలేజీ ఇచ్చే బైక్‌ల కోసం చూస్తుంటారు. పెరుగుతున్న పెట్రోల్ ధరల నేపథ్యంలో ఎక్కువ మైలేజీ ఇచ్చే వాహనాలను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతుంటారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో, మధ్య తరగతి వారు ఇలాంటి బైక్‌ల కోసం చూస్తుంటారు. ఇప్పుడు తక్కువ ధరల్లో అధిక మైలేజీ ఇచ్చే బైక్ గురించి తెలుసుకుందాం..దీవర్ వీఅశ్రీమ్ఘుస్త్రవ దీఅనివ: హీరో స్ప్లెండర్ ప్లస్ దశాబ్దాలుగా భారత ద్విచక్ర వాహన మార్కెట్‌లో ఒక ప్రముఖ బైక్‌గా ఉంది. దీని అమ్మకాలు కూడా రికార్డు స్థాయిలో ఉంటాయి. ద

మంచి మైలేజ్, తక్కువ నిర్వహణ ఖర్చు, నమ్మకమైన పనితీరుతో ఈ బైక్ లక్షలాది మంది భారతీయులకు మొదటి ఎంపికగా మారింది. ముఖ్యంగా రోజూ ఆఫీసుకు వెళ్లేవారు, చిన్న వ్యాపారులు, గ్రామీణ ప్రాంతాల వినియోగదారులలో స్ప్లెండర్ ప్లస్‌కు భారీ డిమాండ్ ఉంది. హీరో మోటోకార్ప్ తయారు చేసిన స్ప్లెండర్ ప్లస్ 97.2ఽఽ ఎయిర్-కూల్డ్, సింగిల్-సిలిండర్ ాఽఇ ఇంజన్‌తో పనిచేస్తుంది. ఈ ఇంజన్ మంచి పనితీరును, ఇంధన సామర్థ్యాన్ని అందిస్తుంది. కంపెనీ ప్రకారం, ఈ బైక్ ఒక లీటర్ పెట్రోల్‌కు సుమారు 70 కిలోమీటర్ల మైలేజీని ఇస్తుంది. పెరుగుతున్న ఇంధన ధరలు ఉన్నప్పటికీ, తక్కువ ఖర్చుతో ఎక్కువ దూరం ప్రయాణించాలనుకునే వారికి ఇది ఒక అద్భుతమైన ఎంపిక. హీరో స్ప్లెండర్ ప్లస్ మరో ప్రత్యేకత దాని సరళమైన, వాడుకకు అనుకూలమైన డిజైన్. ఇది మితిమీరిన ఆడంబరమైన డిజైన్‌లా కాకుండా, రోజువారీ ఉపయోగం కోసం సౌకర్యవంతంగా ఉండేలా రూపొందించారు. సౌకర్యవంతమైన సీటు,

తక్కువ బరువు, సులభమైన నియంత్రణలతో దీనిని అన్ని వయసుల వారు సులభంగా నడపవచ్చు. ఈ బైక్ పట్టణ ప్రాంతాలలో, గ్రామీణ రహదారులపై కూడా బాగా పనిచేస్తుంది. సౌకర్యవంతమైన సీటు, తక్కువ బరువు, సులభమైన నియంత్రణలతో దీనిని అన్ని వయసుల వారు సులభంగా నడపవచ్చు. ఈ బైక్ పట్టణ ప్రాంతాలలో, గ్రామీణ రహదారులపై కూడా బాగా పనిచేస్తుంది.